


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**'ద సిటీ అబ్జర్వర్ కార్యాలయం'** హడావిడిగావుంది.

ఎడిటర్ సచేత్ దద్లానీ, అభిజీత్ మిగతా ఎనిమిదిమంది చీఫ్ జర్నలిస్టులు చర్చలో వున్నారు. అందరి మొహాలూ సీరియస్‌గానే ఉన్నాయి.

"సచేత్ జీ.. వీటన్నిటి వెనకాల వున్నది 'ఖురాసియా' అనే ఓ ఫకీర్. అతను అనేక మంది హిందువుల్ని ఇతర మతస్తులనీ 'బిదాసీ' అనే ఓ అదృశ్య శక్తితోటి లొంగదీసుకుని వారిచేత కొని దుష్టచర్యలు చేయిస్తున్నాడు. వాడు మొన్నటివరకూ ఉన్నది హిందువులు అతి పవిత్ర స్థలంలా భావించే వారణాసిలో. 'బిదాసీ' అని ఆ ఫకీర్ పిలవంగానే, అతనికే వినబడేట్టు ఆ శక్తి పలుకుతుందట. అతను అడిగింది ఎలాగైనా సాధించి పెడుతుందట. దానికి ప్రత్యక్ష సాక్షి మోహన్ గిరి అనబడే ఒక ఆంధ్రుడు. ఈ ఇన్ఫర్మేషన్ చాలా విశ్వసనీయమైనది. ఎలాంటి సందేహం అక్కరలేదు" అన్నాడు నరోత్తమ్ ఝా. అతను యు.పి చీఫ్ కరస్పాండెంట్. తలపంకించాడు సచేత్.

"దద్లానీజీ, కొన్ని గొర్రెలను యమున దగ్గర మొన్న రాత్రి బలి ఇచ్చి ఇనుపముక్కుల గద్దల్ని ఆవాహన చేశారుట. బలి ఇచ్చే ముందు వాటికి కొన్ని ప్రత్యేకమైన మూలికలు పెట్టారట. ఏదో ద్రవ్యాల్ని కలిపిన నీరు తాగించారట.

ఇనుపముక్కుల గద్దలు వచ్చి వాటి నిర్జీవ శరీరాల్ని రాబందుల్లా చీల్చి ముక్కలు ముక్కలు చేశాయట. ఆ ముక్కల్ని కాకులూ, ఇతర మాంసాహార జీవులేకాక, కుక్కలూ ఎగబడి తిన్నాయట. ఆ తరువాత కుక్కలు అతి తీవ్రమైన బాధతో అరుస్తూ ఎవర్ని బడితే వారిని కరవడం చేశాయిట. ఆ కుక్క కాటు తిన్న వాళ్ళు క్షణాల్లో రక్తం కక్కుకుని చనిపోయారట. ఇవన్నీ 'ట' అనబడే ఊహలు కాదు యదార్థాలు" చెప్పాడు మొహమ్మద్ అతీం. అతను ఢిల్లీ కరస్పాండెంట్.

"పత్రికల్లో ఎందుకు రాలేదు" అడిగాడు అభిజిత్.

"హోమ్ మినిస్ట్రీనించి ప్రజర్. విషయాలు బైటికి పొక్కకూడదని సమాచారాన్ని అణచిపెట్టారు. అదీ అవసరమే. ఇటువంటి సమాచారం  బయటకి పొక్కితే ప్రజలు భయభీతులవుతారు. పుకార్లు షికార్లు చేసి ఒకరకమైన గందరగోళం సృష్టిస్తాయి. ఢిల్లీ, యుపి, ఎంపి, హర్యానా, పంజాబ్, చండీఘర్ పోలీసులందరూ యీ పరిస్థితిని ఎదుర్కొనే దిశగానే శ్రమిస్తున్నారు. మనం కూడా సమాచారాన్ని సేకరించాలేగాని పబ్లిష్ చెయ్యడం తెలివైన పనికాదు" జవాబిచ్చాడు హర్యానా చీఫ్ కరెస్పాండెంట్ రిషీయాదవ్.

"యస్" ఒక్క ముక్కతో ఆ సమాచారం నిజమన్నట్టు ధ్రువీకరించాడు సబర్‌జీత్ సింగ్. అతను పంజాబీ జర్నలిస్ట్.

"మోహన్ గిరిని కాంటాక్ట్ చేశారా?" నరోత్తమ్ ఝావంక సూటిగా చూస్తూ అడిగాడు సచేత్ దద్లానీ.

"యస్.. అతను ఓ నిరాసక్తుడైన సన్యాసిలా కనిపించినా, చాలా లోతైన పరిశోధకుడిలా నాకు అనిపించాడు. నాతోపాటు అతన్నీ యీ మీటింగ్‌కి తీసుకు వద్దామని అనుకున్నాను. కానీ, చాలా సున్నితంగా తిరస్కరించాడు డబ్బు ఆఫర్ చేస్తే నవ్వి, "సిల్లీ వే ఆఫ్ ట్రయింగ్ మిస్టర్ ఝా. మీరు ఎంత డబ్బిచ్చినా నేను టెంప్ట్ కాను. సన్యాసికి డబ్బెందుకూ" అన్నాడు. సచేత్‌జీ, అతన్ని కలవాలంటే మనమే అతని దగ్గరకు వెళ్ళాలి. అంతకిమించి మరో దారి లేదు" అన్నాడు నరోత్తకుఝా.

"సౌత్ పరిస్థితి ఏమిటీ?" అందరి వంక చూసి అన్నాడు సచేత్.

"ఉంది. కానీ, నార్త్ అంత తీవ్రమైన పరిస్థితిలేదు. భారత దేశ ప్రధాన మంత్రిత్వశాఖలూ, అంగాలు, అధికార గణాలు అందరూ ఉండేది నార్తేకదా. ఇక్కడ జయిస్తే ఎక్కడైనా జయించినట్టే. ఒకప్పుడు హిందీ సినిమా హిట్టా, ఫట్టా అనేదానికి ఢిల్లీ ఆడియన్స్ దిక్సూచిగా వుండేవారు. ఢిల్లీలో హిట్ అయితే నిర్ద్వందంగా ఇండియా మొత్తంలో హిట్, సౌత్ ఇండియా ఇప్పటివరకూ దేశ రాజకీయాల్ని శాసించేంత సామర్థ్యాన్ని పెంచుకోలేదు. కారణం వాళ్ళు భాషా ప్రయోక్త రాష్ట్రాలేవాళ్ళ బలహీనత. భాషలు వాళ్ళని ఏనాడూ కలవనివ్వవు. కలిసి పోరాడనివ్వవు. సో, ఎవరు దేశాన్ని ఇరకాటంలో పెట్టాలన్నా నార్త్ వైపే చుస్తారు. కానీ సౌత్ వైపు చూడరు" స్పష్టంగా అన్నాడు అభిజీత్.

చిన్నగా నవ్వాడు సచేత్ అభిజీత్ మాటలకి.

"అభిజీత్, అందుకే సౌత్ వైపే మనం దృష్టిపెట్టాలి. నార్త్‌లో కొంత హింస, హడావిడీ జరుగుతుంది. అప్రమత్తమూ అవుతుంది. సౌత్‌ని ప్రస్తుతానికి వాళ్ళు టార్గెట్ చెయ్యరూ. సమస్తము మెల్లగా సమకూర్చుకుని ఒక్కసారిగా, సునామీలా విరుచుకుపడతారు. సౌత్ నించి నార్త్‌కి విరుచుకు పడతారు. ఒక్కసారి ఊహించు. నన్నడిగితే మౌనంగా ఇప్పటికీ అక్కడ నిప్పుల కుంపట్లు సిద్ధం అయివుండాలి. 'ద సిటీ అబ్జర్వర్ ' బ్రాంచ్‌లు సౌత్‌లో ఎంత త్వరగా మనం ప్రారంభించగలిగితే అంత మంచిది" అన్నాడు సచేత్.

"అదంత తేలికకాదు సచేత్. వాళ్ళు కొన్నిటిని గౌరవిస్తారు. 'ది హిందూ' నిశ్చలంగా నిర్ద్వందంగా నిర్మలంగా యీనాడూ సాగిపోతోంది. అలానే చాలా పత్రికలు ఒక పత్రికకో, ఒక ఛానల్‌కో వారు అలవాటు పడితే, వారిని దారి మళ్ళించి వేరే పత్రికని చదివించడం అంత సులభంకాదు. నిజం చెబితే అసాధ్యం. వారి లాయల్టీ అటువంటిది."

స్పష్టంగా అన్నాడు సబర్‌జీత్‌సింగ్. అతను కొన్నేళ్ళు తమిళనాడు (మద్రాసు రాష్టం)లో ఉన్నాడు గనక అతనికి సౌత్ నాడి చాలావరకూ తెలుసు.

"ఇంకో విషయం సచేత్, నార్త్‌లోనే మన పత్రిక నెంబర్ 1 కాదు. అయిదో, ఆరో స్థానాల్లో ఉంటుందేమో. పత్రిక బ్రాంచీలు తెరవాలంటే ఎంత కష్టమో నీకు తెలియనిది కాదు. ఒకవేళ పెట్టినా, జనాల చేత వాటిని చదివించలేకపోతే? బ్రేక్ యీవెన్ కావాలన్నా కనీసం 5,6 సంవత్సరాలు పడుతుంది. అదీ నార్త్‌లో అయితే. సౌత్‌లో బ్రేక్ యీవెన్ కావాలంటే కనీసం పదేళ్ళు. అంతకాలం నష్టంలో నడపగలమా? మనం చర్చిస్తున్నది ఓ ఎమర్జెన్సీ గురించి, యీ విష వృక్షపు విత్తనాలు ఎవరు నాటారా అని, దానికోసం గూఢచర్యం చెయ్యాలంటే, అన్‌లిమిటెడ్ బడ్జెట్ ఉండాలి. ఇది ఏ.సి.బి ఐ సంస్తో, R.A.W నో చేపట్టాల్సిన వ్యవహారం. మనలాంటి చిన్నా చితకా పత్రికలు కాదు" స్పష్టంగా అన్నాడు నరోత్తం ఝూ

"యస్. అదీ ఆలోచించవలసిన పాయింటే" అన్నాడు మొహమ్మద్ అతీం. సచేత్ అందరివంకా చూశాడు, కానీ ఏమీ మాట్లాడలేదు. కాసేపు ఏసి హాల్ అంతా అందరి ఆలోచనలతో వేడెక్కింది.

"సచేత్, నీవు ఇంత లోతుగా యీ సమస్యలో దిగాలనుకుంటున్నావని అర్ధమయింది. కారణం తెలుసుకోవచ్చా?" అందరిలోకీ అనుభవజ్ఞుడూ, ద సిటీ అబ్జర్వర్ సలహాదారూ, సచేత్ అమితంగా బాబాయ్ అంటూ గౌరవించే శమంతో భట్టాచార్య సూటిగా అడిగాడు.

"నాట్‌నౌ... యీ క్షణంలో చెప్పలేను. కానీ బాబాయ్, ఇది సౌత్ నార్త్ సమస్యకాదు. ప్రపంచ ఉనికికి సంబంధించిన సమస్య. మనందరం జీవించి వుండాలంటే, ప్రపంచం అనేది ఉంటేనేగదా? ఇది కొందరు తీవ్రవాదులో, టెర్రరిస్టులో మత ఛాందసులో సృష్టిస్తున్న సమస్యకాదు. ఇందులో, అంటే, యీ సమాచార సేకరణలో పాల్గొనడం అంటే, మన ప్రాణాల్ని మనం రక్షించుకోవడం లాంటిదే." ఒక్క క్షణం ఆగాడు సచేత్.

"మీ అందరికీ తెలుసు. నా తండ్రి చైనావార్‌లోనూ, పాకిస్తాన్ వార్‌లోనూ పాల్గొన వీరసైనికుడు. అంతేకాదు, ఆయనో పెద్ద విశ్లేషకుడు. ఆయన రిటైరయ్యాక వ్రాసే వ్యాసాలకోసం పత్రికలు ఎదురు చూసేవి. ఆయన అడుగుజాడల్లోనే సిటీ అబ్జర్వర్‌ని నడుపుతున్నాను. నా మోటివ్ ధన సంపాదనకాదు. నా దేశ రక్షణ" ఆగాడు సచేత్.

అందరి కళ్ళూ హాల్లో పెట్టివున్న సచేత్ దద్లానీ తండ్రి మహా వీర్ దద్లానీ ఫోటోవైపు తిరిగాయి. మహావీర్ మహావీరుడేగాదు, స్ఫురద్రూపి. ఆజానుబాహుడు.

సచేత్ కూడా ఓ నిముషం తండ్రి ఫోటో వంక చూసి అన్నాడు.

"బడ్జెట్ వ్యవహారం త్వరలోనే ఓ కొలిక్కి వస్తుంది. మనమేకాదు, యీ మహా విపత్తు నించి కాపాడటానికి చాలామంది ముందుకొస్తున్నారు. ఆ విషయాలు సర్వం నిర్ధారిత మయ్యాక చర్చించుకుందాం. ప్రస్తుతానికి మనకి ఉన్న బలగంతోటే సమాచార సేకరణకి సమాయత్తం అవ్వాలి. నాకు తెలుసు ఇది ఎంత క్లిష్టమో. గడ్డివాములో గుండు సూదిని వెదకటంలాంటిది యీ పని. కానీ, మనస్ఫూర్తిగా చేసిన ఏ పని అయినా ప్రతిఫలాన్ని ఇచ్చి తీరుతుందని మా నాన్నగారు నమ్మేవారు. నేనూ అదీ నమ్ముతా. ఆ నమ్మకంతోనే మనందరం ముందుకి సాగుదాం" అన్నాడు సచేత్.

"ష్యూర్.. మా సర్వశక్తులా ప్రయత్నిస్తాం" అన్నారు ఒక్కొక్కరూ తమతమ పదాల్లో.

"జైహింద్" చర్య ముగించినట్టుగా కుర్చీలోంచి లేచాడు సచేత్. "జైహింద్" అందరూ తమ తమ సీట్లనించి లేచారు. అందరి మనస్సులలోనూ ఓ నిర్ణయం, కళ్ళల్లో ఓ నమ్మకం తొణికిసిలాడాయి.

'హెర్మన్' జైంట్ ఆఫ్ ఏ మాన్ అంటారు. అంటే నరరూప రాక్షసుడని. భీకరమైన ఆకారం. మన 'ఖలీ' కంటే భారీ శరీరం. వొంపులు తిరిగి బెంబేలెత్తించే కండలు. మనిషి మాత్రం మహా సాత్వికుడు. చిన్న వయసులోనే టీచర్లు, 'నీకెందుకురా చదువు, గోదాలో దిగు.. డబ్బే డబ్బు' అని ఆట పట్టించేవారు. ఆ అల్లరి తట్టుకోలేక ఏడో తరగతిలోనే చదువు మానేశాడు. ఎందుకంటే, పిల్లలకి అర్ధమైంది. హెర్మన్ ఆకారం భీకరమైనా మనసు బేలదని. పిల్లలు యధేచ్ఛగా అతన్ని ఆటపట్టించేవాళ్ళు. హెర్మన్ తండ్రి ఆండ్రియన్. అతను ఆంగ్లో ఇండియన్. అతని తండ్రి తాతా కూడా రైల్వేస్‌లోనే పనిచేసేవాడు. మంచి అందగాడు. ఆజానుబాహుడు. అతన్ని నజఫ్‌గాడ్ వాస్తవ్యురాలైన షర్బతీ చూసి, ప్రేమించి పెళ్ళి చేసుకుంది. షర్బతో జాట్ స్త్రీ. మాంఛి కండపుష్టిగలది. వాళ్ళిద్దరికీ నలుగురు మగపిల్లలు పుట్టారు. అందర్లోకీ చివరవాడు హర్మన్. మిగతా వాళ్ళంతా మామూలుగానే వున్నా హిర్మన్ మాత్రం దాదాపు ఏడడుగుల పొడుగూ 115 కిలోల బరువుతో ఓ చిన్న రాక్షసుడిలా ఉండేవాడు. చిన్నప్పటినించీ 'చాంద్' అనే ఆయన గోదాలో కుస్తీలు నేర్పాడు గనక అద్భుతమైన శరీర సౌష్టవం అతని సొంతమయింది. మెల్లగా కుస్తీ పోటీల్లో నేషనల్స్‌ని దాటి ఇంటర్నేషనల్ పోటీల్లో కూడా పాల్గొనడం మొదలెట్టాడు. అతన్ని అందరూ 'దారాసింగ్' 'ద గ్రేట్'తో పోల్చేవారు. ప్రపంచ కుస్తీపోటీల్లో చాలా గొప్ప పేరు

తెచ్చుకున్నాడు. డబ్బు వచ్చింది. మనసు మాత్రం చాలా సౌమ్యమైనది. ఓ రోజు అతని ఫ్రెండు, వరల్డ్ కుస్తీ పోటీల్లో సహపోటీదారూ అయిన అబిద్ (ఈజిప్ట్) తను ప్రత్యేకం తనతో తెచ్చుకున్న మాంసాహార వంటకం హర్మన్‌తో పంచుకున్నాడు.

ఆ సమయంలోనే లంచ్ కానిస్తున్న ఇతర పోటీదార్లు కూడా తలో ముక్క ఆరగించారు. హాయిగా విశ్రాంతిగా పడుకున్నారు. పోటీలు రాత్రి 7నించి 10వరకూ. ఎందుకంటే ప్రపంచం నలుమూలలనించీ వార్తాహరులు వస్తారు, లైట్ల మిలమిలల్లో పోటీ ఇంకా రసవత్తరంగా ఉంటుంది గనక.

సాయంత్రం అయిదింటికల్లా లేచి వారి వారి అలవాట్ల ప్రకారం కొంతసేపు ధ్యానం, కొంతసేపు వ్యాయామం చేసి ఒళ్ళు చక్కగా చల్లని నీటిలో తడిపిన తెల్లని టవల్స్‌తో తుడుచుకుని మౌనంగా కాసేపు ఉన్నారు. ప్రారంభ పోటీ డెన్మార్ యోధుడికీ అజార్ బైజాన్ యోధుడికీ మధ్యనా.

గంట కొట్టారు. యోధులిద్దరూ బరిలో దిగారు. మూడో రౌండ్లో అనూహ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోటీదారులిద్దరూ, ఫాలో అవ్వాల్సిన రూల్స్‌ని అతిక్రమించి అతి ఘోరంగా కొట్టుకోసాగారు. ఎంతగా అంటే రిఫరీని కూడా ఇద్దరూ కలిసి రక్తం ఓడేలా కొట్టి క్రిందపడేసేంత. మిగతా ప్రజలు ఆ రక్తపాతాన్ని ఆపడానికి స్టేజ్ మీదకి పరిగెత్తారు. ఆ క్రమంలో ఒకరినొకరు తోసుకుని రెచ్చిపోయి భయంకరంగా కేకలు పెడుతూ ఏది పడితే దానితో కొట్టుకోసాగారు. జనాలు అదికూడా 'బౌట్'లో భాగమేననుకుంటూ వెర్రిగా కేరింతలు కొడుతు ఈలలు వేశారు. ఆ కేకలకి రెచ్చిపోయిన రెజ్లర్లు మరింత భీకరంగా కొట్టుకోసాగారు. ఇరవై ఆరునిముషాల తరవాత చూస్తే కాళ్ళూ చేతులూ విరిగిపోని రెజ్లర్ ఒక్కడు లేడు. ఇద్దరికి నడుములు విరిగి జీవచ్ఛవాలయ్యారు. కారణం ఏదో ఎవరూ తేల్చలేకపోయాడు అప్పటికప్పుడు కార్యనిర్వాహకులు పోటీలని నిరవధిక వాయిదా వేశారు. అందరిలోకీ మాట్లాడగలిగి, నడిచే స్థితిలో వున్నవాడు ఒక్క హెర్మనే. చాలా ప్రయత్నం మీద చెప్పాడు, ఈజిప్ట్ రెజ్లర్ అబీద్ భోజనాన్ని తాను షేర్ చేసుకున్నాననీ, అలాగే అందరూ తలా ముక్కా తిన్నారనీ, బహుశా అందరిలోను క్రోధం విజృంభించడానికి అదే కారణం కావొచ్చుననీ. బ్లడ్ శాంపుల్స్ తియ్యబడ్డాయి. కానీ కారణం దొరకలేదు. ప్రపంచంలో అదో మిస్టరీగా మిగిలిపోయే పరిస్థితి వుందని సెంట్రల్ కమిటీ ఒక బులెటన్ విడుదల చేసి చేతులు దులుపుకుంది. చాలామంది విలేఖరులూ, వార్తా సంస్థల యజమానులు అబిద్'ని కాంటాక్ట్ చెయ్యడానికి ఎంత ట్రై చేసినా ఫలితం లేకపోయింది. అతని రెండు దవడలూ విరిగి అతి దీన స్థితిలో ఉండటమే కారణం. హెర్మన్‌ని ఎంత ప్రశ్నించినా మరే సమాచారమూ ఎవరూ రాబట్టలేకపోయారు. కారణం అంతకిమించి అతనికీ ఏదీ తెలియదు గనక.

ఈ సంఘటన ప్రపంచాన్ని ఒక వూపు వూపింది. దీనితోబాటు తపతీనది ఒడ్డున పెద్ద ఎత్తున పశువులు మరణించడం, వాటికి, అంటే ఆ మరణాలకి కారణం ఇనుపముక్కు గద్దలు కావడం అనే వార్త కూడా తాబేలు నడకలా

మొదలై కుందేలు పరుగులా ప్రపంచాన్ని చుట్టింది. ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. దేశాధినేతలు తవ్వడం మొదలెట్టాక ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు ఆల్మోస్ట్ అన్ని దేశాల్లోనూ కొద్దో గొప్పో బయటపడ్డాయి. ఎవడో అగంతకుడు ఓ స్కూల్లో నలభైమంది స్టూడెంట్స్‌ని నిర్దాక్షిణ్యంగా కాల్చడం, ఓ మసీదులో ఓ ఆత్మాహుతి దళంవాడు తనని తాను పేల్చుకుని 500 మంది మృతికి కారణం కావడం,  విపరీతంగా రద్దీ వుండే ప్రాంతాల్లో స్కూటర్ బాంబులు, రద్దీ అవర్స్‌లో బస్సుల్లో టిఫిన్ బాక్సు బాంబులు పేలి వందలమంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలవడం, ఇలాంటి సంఘటనలతో ప్రపంచ పత్రికలన్నీ అట్టుడికాయి. ఏ దేశమూ మరో దేశాన్ని నమ్మక, అపనమ్మక దృష్టితో చూడడం మొదలుపెట్టాక, స్పర్ధలు మొదలై రక్షణ శాఖలు అప్రమత్తమవడం, వ్యాపారాలూ రాకపోకలూ నిలిచిపోవడం జరిగాయి. మత సామరస్యం ముక్కలయింది. ఎక్కడికక్కడ ఘర్షణలూ, కొట్లాటలూ సాధారణ మానవ జీవితం దుర్భరమైంది. ఎగుమతి దిగుమతులకు అవరోధం ఏర్పాటం వల్ల ధరలు ఆకాశం ఎత్తున పెరిగాయి. దిక్కులేని ప్రజలు సాటి ప్రజల్ని దోచుకోవడం మొదలు పెట్టారు. గంజాయి, నల్లమందు, మత్తు మందులూ విచ్చలవిడిగా విస్తరించి యువతని నిర్వీర్యం చేయడమేకాక, యువతలో ఘోర కృత్యాలు చేయించడం ప్రారంభమైంది. స్కూళ్ళు మత్తుతో జోగుతున్నాయి. వీధి వీధికీ బార్లు. అరికట్టలేని స్థితికి అవినీతి పెరిగింది. కుల, మత, వర్ణ, ధన ప్రాతిపదికతో జనాల్ని ముక్కలు చేసి ప్రభుత్వాలు, రాజకీయ నాయకులూ కడుపులో చల్ల కదలకుండా పబ్బం గడుపుకోవడం మొదలుపెట్టారు. రక్షక భటులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బ్రతుకుతున్నారు. కరవమంటే కప్పకి కోపం మింగమంటే పాముకి కోపం. పోలీసు వ్యవస్థకీ, జనాలకీ, ప్రభుత్వానికి మధ్య పరిస్తితి ఎటూ చెప్పలేని స్థితికి చేరుకుంది. ఎవరూ ఎవర్నీ  నమ్మరు. ఎవరికీ దేనిమీదా నమ్మకం లేదు. అసలు నమ్మకం మీదే నమ్మకం లేని స్థితికి జనాలు చేరుకుంటున్నారు."

చీకట్లో లారీలైట్లు మైలు దూరాన్నించి ఎలా కనబడుతాయో, రాబోయే భయంకర సంక్షోభానికి ఆధారాలు అలా కనబడుతున్నాయని" విజ్ఞులు తలలు పట్టుకుని కూర్చున్నారు. కింకర్తవ్యం?

"కింకర్తవ్యం?" అనేది నేటి ప్రశ్న" అన్నాడు యజ్ఞప్ప.

"నిజమే.. రాబీ గుడిమల్లంలో పూజలు చేయాలన్నారు. చేశారు. అదృష్టవశాత్తు శ్రీనివాస్ శరద్వతితో కలిసి రావడం వారి వివాహం అక్కడే జరిపించడం కూడా జరిగింది. ఇప్పుడు  ఏం చెయ్యాలీ, రాబీ తన దేశం వెళ్ళిపోతానంటున్నాడు. అది అతని చేతుల్లో వుందా? కేవలం గుడిమల్లంలో పూజలు చేయించడానికేనా, అతను ఇన్నాళ్ళూ కొంత స్పృహలోనూ కొంత కోమాలోనూ వుండడం? అసలు జయ్ ఇంతకాలం పనులన్నీ మానుకుని ఎందుకుండాలీ? సుదర్శన్‌కి ఇందులో ఏం సంబంధం?" ప్రశ్నించాడు రామజోగి. అతను వివాహానికి హాజరు కాలేదు. కానీ సర్వం కూలంకషంగా విని అన్నాడు.

"జయ్, సుదర్శన్ ఎప్పుడో వెళ్ళాలని అన్నారు. కానీ వెళ్ళలేకపోయారు. రాబీ కూడా వెడతానన్నాడు. కానీ అతను స్వయం నిర్ణయయం తీసుకోలేదు. అతని నీడలా వెనక విలియమ్స్ వున్నాడు. శ్రీనివాస్ చెప్పిన ప్రకారం యీ విలియమ్స్ కి భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసు. అందుకే శరద్వతికీ శ్రీనివాసుకీ వివాహం జరిగేలా చూశాడు. వారికి పుట్టే బిడ్డ మహిమాన్వితుడవుతాడనీ చెపాడు. అయ్యా, నేను ఎక్కడున్నా ఇబ్బంది లేదు. నాకువున్న ఆయుష్షునంతా లోకం కోసం వెచ్చించడానికి సిద్దంగా వున్నాను. ఇప్పటివరకూ జరిగినవన్నీ ఆషామాషీగా జరిగినవి కాదు. ఓ తుఫాను రాకని మనుషులు పసిగట్టలేకపోవచ్చు. కానీ, ఎలుకలు ఉడతలు, కొన్ని పక్షులు క్రిమికీటకాలు స్పష్టంగా వాతావరణ మార్పుని గుర్తించగలవు. అలాగే ఒక మహా ప్రళయపు లక్షణాలు మనకి గోచరమయ్యాయి . ఏం చెయ్యాలో నిర్ణయించుకుని చేద్దాం" అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"అవును గురుదేవా.. నేను వచ్చిందీ ఆ విషయాన్ని మీతో చర్చించి ఓ నిర్ణయానికి రావడానికే, రోజురోజుకీ పరిస్థితులు విషమిస్తున్నాయి. పరిస్థితి చేయి జారకమునుపే మనం స్పష్టంగా చర్చించి ఓ నిర్ణయానికి రావాలి" అన్నాడు రామజోగి.

"అయ్యా, మట్టూ, శృంగి అనే ఇద్దరు మీకోసం వచ్చారు" రామజోగితో చెప్పాడు అప్పుడే లోపలికి వచ్చిన శ్రీనివాస్.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments